
హైదరాబాద్ వార్త



# సంక్రాంతి నాటికి 'చెరువులు' రెడీ



సర్వంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న కూకట్‌పల్లి నల్లచెరువు

-పతంగుల పండగకు అక్కడే ఏర్పాట్లు -హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, డిసెంబర్ 24,ప్రభాతవార్త:** పతంగుల పండగ నాటికి చెరువులను సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 13 నుంచి 15 వరకూ రాష్ట్ర ప్రభుత్వం పతంగుల పండగ నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. ఈ సారి హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత కూడా పతంగుల పండగను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బుధవారం హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించారు. తమ్మిడికుంట, కూకట్‌పల్లిలోని నల్ల చెరువులను సందర్శించి పలు సూచనలు చేశారు. చెరువులలోకి నేరుగా మురుగు నీరు చేరకుండా ఎస్‌టీపీ(సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు)ల ద్వారా శుద్ధి జలాలు వచ్చేలా ఏర్పాటు వెంటనే చేపట్టాలని సూచించారు. ఎస్ టీపీలను ఏర్పాటుచేసిన ప్రాంతంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఇందుకు చెరువు చెంత ఉన్న ప్రభుత్వ భూమిని వినియోగించుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధితో పాటు.. గ్రీనరీని పెంచాలని సూచించారు. ప్రతి చెరువును ఒక పర్యాటక ప్రాంతంలా అభివృద్ధి చేయాలన్నారు. వయసు మళ్లిన వారు సేదదీరే విధంగా కూర్చునే వెసులుబాటుతో పాటు నీడ కల్పించాలని.. చిన్నారులు ఆడుకునేందుకు ప్లే ఏరియాలను అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు.

**ఏర్పాట్లలో పతంగుల పండుగ భాగం కావాలి..**

పతంగుల పండుగ ఆహ్లాదకర వాతావరణంలో జరిగేందుకు జీహెచ్ఎంసీ, పర్యాటకంతో పాటు.. వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పని చేయాల్సినవసరాన్ని రంగనాథ్ అధికారులకు సూచించారు. చెరువుల చెంత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని.. తాగు నీటి వసతితో పాటు.. మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే చెరువులను సందర్శించేందుకు వచ్చిన వాహనదారులు ఇబ్బందులు పడకుండా సులభంగా వచ్చి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్న పార్కింగ్ సౌకర్యాన్ని పరిశీలించారు. చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నందున.. అక్కడ దుమ్ము, దూళి ఎగరకుండా నీళ్లు చిలకరించాలన్నారు. వర్షాకాలం పూర్తైన తర్వాత రూపొందుతున్నందున చెరువుల్లో నీటిని నింపేందుకు ఎస్టీపీలను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. మూసీ నది ప్రక్షాళనను ప్రభుత్వం చేపడుతున్న వేళ.. చెరువుల మంచినీరు మూసీలో చేరేలా చూడాలన్నారు. ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్ల నిర్మాణంతో పాటు.. పరిసర ప్రాంతాల నుంచి వర్షపు నీరు సులభంగా చెరువులోకి చేరేలా ఛానల్స్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

**సంబురాలకు వేదికలుగా చెరువులు..**

మురుగు నీటితో దుర్గంధబరిత వాతావరణంలో ఆక్రమణలకు గురై చెరువు ఆనవాళ్లు కోల్పోయిన చెరువులను హైడ్రా అభివృద్ధి చేయడంతో సంబురాలకు వేదికలౌతున్నాయి. ఇటీవల బతుకమ్మ ఉత్సవాలకు అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట వేదికైతే.. నేడు సంక్రాంతి సంబరాలకు బతుకమ్మకుంటతో పాటు.. మాధాపూర్‌లోని తమ్మిడికుంట, కూకట్‌పల్లిలోని నల్ల చెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్న్ ఉద్‌దౌలా వేదికలౌతున్నాయి. హైడ్రా మొదటి విడతగా చేపట్టిన ఆరు చెరువుల పునరుద్ధరణలో ఉప్పల్ లోని నల్లచెరువు, మాధాపూర్‌లోని సున్నం చెరువు ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉంది. పతంగుల పండుగకు చెరువులు వేదికలౌతుండడం పట్ల నగర ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలతో కనుమరుగౌతాయనుకున్న చెరువులు రూపురేఖలను మార్చుకుని విస్తరణకు నోచుకున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. మొదటి విడత చేపట్టిన ఆరు చెరువులు హైడ్రా పనులు చేపట్టక ముందు 105 ఎకరాలుంటే.. ఇప్పుడు 180 ఎకరాలకు విస్తీర్ణం పెరిగాయన్నారు.




## క్రిస్మస్ సందర్భంగా నగరంలో ముస్తాబైన చర్చిలు

# ఏం చేద్దాం..ఎలా చేద్దాం..?

**-డీలిమిటేషన్‌పై జిహెచ్ఎంసి కమిషనర్ తీవ్ర కసరత్తు**
**-జోన్లు, సర్కిళ్ల విభజనపై ఉన్నతాధికారులతో చర్చలు**
**-పలువురు జోనల్, అడిషనల్ కమిషనర్లతో వరుస భేటీ**
**-ఈనెలాఖరులోగా ఫైనల్ నోటిఫికేషన్ వచ్చేలా ప్రణాళిక**




**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలనాపరమైన సంస్కరణలకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. డివిజన్ల పునర్విభజన ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకోవడంతో..క్షేత్రస్థాయిలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జోన్లు, సర్కిళ్ల సంఖ్యను భారీగా పెంచాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నిర్ణయించారు. ఈనేపథ్యంలో ఏప్రాంతాలను జోన్లుగా, సర్కిళ్లుగా విభజిస్తే పాలనాపరంగా అనుకూలంగా ఉంటుందనే దానిపై తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు బుధవారం ఇదే అంశంపై జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని తనఛాంబర్‌లో పలువురు అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లతో సుమారు రెండుమూడు గంటలపాటు సమావేశమై వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఈనేపథ్యంలో వారం రోజుల్లో కొత్త సర్కిళ్లు, జోన్ల హద్దులను ఖరారు చేస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. గతంలో 650 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జీహెచ్ఎంసీ.. ఇటీవల 27 శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల విలీనంతో ఏకంగా 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ప్రస్తుతం ఆరు జోన్లు, 30 సర్కిళ్ల ద్వారా సాగుతున్న పరిపాలన ఇంత భారీ విస్తీర్ణానికి సరిపోవడం లేదని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం నుంచి పెద్దఅంబర్‌పేట్ వంటి సుదూర ప్రాంతాల్లో పారిశుద్ధం, వీధిలైట్లు, రహదారుల పనులను పర్యవేక్షించడం జోనల్ కమిషనర్లకు సవాలుగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుతమున్న 6 జోన్లను 12కు, 30 సర్కిళ్లను 60కి పెంచాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రతి జోన్ పరిధిలో సగటున ఐదు సర్కిళ్లు ఉండి, పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది.

వచ్చే ఏడాది జనవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఒకసారి జనగణన మొదలైతే, తదుపరి రెండేళ్ల వరకు డివిజన్ల మార్పులు లేదా పునర్విభజన చేపట్టడం సాధ్యపడదు. ఈ సాంకేతిక ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని.. ప్రభుత్వం అత్యంత వేగంగా శివారు ప్రాంతాల విలీనాన్ని పూర్తి చేసి పునర్విభజన ప్రక్రియను కొలిక్కి తెచ్చింది. ఈ వ్యవస్థీకరణ కేవలం సౌలభ్యం కోసం మాత్రమే కాకుండా.. భవిష్యత్తులో జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర మహానగరపాలక సంస్థలుగా విభజించాలనే ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహానికి పునాదిగా కనిపిస్తోంది. ప్రభుత్వ ప్రాథమిక ఆలోచన ప్రకారం.. మూసీ నదిని సరిహద్దుగా తీసుకుని నగర విభజన జరగనుంది. మూసీకి దక్షిణాన ఉన్న ప్రాంతాలన్నింటినీ కలిపి ఒక కార్పొరేషన్‌గా దీనికి జీహెచ్ఎంసీ పేరునే కొనసాగించే అవకాశం ఉంది. ఉత్తరాన ఉన్న ప్రాంతాలను సికింద్రాబాద్, సైబరాబాద్ పేరుతో మరో రెండు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసే దిశగా కసరత్తు సాగుతోంది. ఈ చారిత్రాత్మక మార్పు ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయించడం, ట్రాఫిక్, వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలను స్థానికంగానే పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. ఈ పునర్ వ్యవస్థీకరణ పూర్తయితే.. హైదరాబాద్ మహానగరం పాలనాపరంగా సరికొత్త రూపురేఖలను సంతరించుకోనుంది.

# జ్ఞానానికి వారధి పుస్తక పఠనం

-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు -ఉత్సాహంగా సాగిన పుస్తక నడక




పుస్తక నడక కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితరులు



స్టాల్‌లో వార్త దినపత్రికను చదువుతున్న సందర్శకులు

**ముషీరాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** జ్ఞానానికి వారధి పుస్తక పఠనమని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు స్పష్టం చేశారు. బుధవారం 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో భాగంగా ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ దేవాలయం నుంచి బుక్‌ఫెయిర్ ప్రాంగణం వరకు పుస్తక నడక పేరుతో అక్షర సేద్యం-పఠనమే భాగ్యం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరై రామకృష్ణారావు జెండా ఊపి, పుస్తక నడకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న ప్రపంచంలో సాంకేతికత ఎంత పెరిగినా, ఎన్ని మార్పులు వచ్చినా, పుస్తకానికి ఉన్న ప్రాధాన్యత ఏ మాత్రం తగ్గలేదని అన్నారు. పుస్తకాలు అనేవి మనల్ని మరో లోకానికి తీసుకువెళ్లే అద్భుతమైన ద్వారాలని కొనియాడారు. ఇతరుల జీవిత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవటానికి పఠనం ఒక వారధిలా ఉపయోగపడుతుందన్నారు. బాహ్య ప్రపంచం వేగంగా మారినా, పుస్తకాల ద్వారా పొందే జ్ఞానం శాశ్వతమైనదని తెలిపారు. అనంతరం ఆయన బుక్ డొనేషన్ బాక్స్‌ను ప్రారంభించి, పుస్తక దాన ప్రాధాన్యతను వివరించారు. ప్రజలలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచేందుకు ఇటువంటి అద్భుతమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న బుక్‌ఫెయిర్ నిర్వాహకులను ఆయన అభినందించారు. బుక్‌ఫెయిర్ అధ్యక్ష కార్యదర్శులు కవి యాకుబ్, ఆర్.వాసులు మాట్లాడుతూ ఈనెల 19న ప్రారంభమయిన పుస్తక ప్రదర్శన 29 వరకు కొనసాగుతుందని తెలిపారు.

ఈ సారి పుస్తక ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, లక్షలాది మంది పుస్తక ప్రియులు నిత్యం పుస్తక ప్రదర్శనను సందర్శించి, వారికి నచ్చిన పుస్తకాలను సేకరిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్‌లర్ ఎస్వీ సత్యనారాయణ, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, సుద్దాల అశోక్ తేజ, ఎం.వేణు గోపాల్, విరాహత్ అలీ, వల్లీశ్వర్, విజయ్‌కుమార్, శిల్పి రమణారెడ్డి, మల్లేపల్లి లక్ష్మయ్య, ఎకె. ప్రభాకర్, ఆనందాచారి, మోహనకృష్ణ పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

-పాలమూరు బిడ్డనని చెప్పకునే సిఎం రేవంత్‌రెడ్డి అన్యాయం చేస్తున్నారు
-ధ్వజమెత్తిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** అధికారంలోకి వచ్చినప్పటి నుండి గడచిన రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌పై నిర్లక్ష్యంగా ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. హైదరాబాద్ సమీపంలోని జిల్లెలగూడ సామ యాదిరెడ్డి కన్వెన్షన్‌లో రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిల ఆధ్వర్యంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన ముఖ్య నేతల సమావేశం జరిగింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌పై నిర్వహించిన ఈ కీలక సమావేశంలో పాల్గొన్న వారు కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగానికి సాగునీటి కష్టాలు ఉండవద్దనే ఉద్దేశ్యంతో నాటి సిఎం కెసిఆర్ కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి పేరిట రెండు అతి పెద్ద ప్రాజెక్ట్‌లను అప్పట్లో ప్రారంభించిందని వివరించారు. అన్నదాతలకు సాగు నీరు అందించే ప్రధాన లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్ట్‌లను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోయిందని ఆమె ఆరోపించారు. పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి అయితే ఏడు నియోజకవర్గాలకు సాగు నీరు అందేలా రూపొందించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూపాయి కూడా కేటాయించలేదనీ అంతే కాకుండా ప్రాజెక్ట్ కోసం తట్ట మట్టి కూడా తీయించలేదని ఆమె విమర్శించారు. పాలమూరు ప్రాజెక్ట్‌పై కెసిఆర్ చెప్పిన వాస్తవాలను పక్కనబట్టిన కాంగ్రెస్ మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె అన్నారు. అధికారంలో ఉన్ననాళ్ళు బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్, రిజర్వాయర్ల ద్వారా సాగు నీరు అందించిందనీ అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాజెక్ట్‌లను అసంపూర్తి పనులు చేయించకుండా కేవలం కెసిఆర్‌పై బురద జల్లే పని పెట్టుకుందని ఆమె ఎద్దేవా చేశారు. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేయించకుండా అది పూర్తిగా కూలిపోవాలని సిఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని సబితారెడ్డి పేర్కొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి కేవలం తన స్వంత నియోజకవర్గానికి మాత్రమే నీళ్లు తీసుకెళ్ళాలని ప్రయత్నిస్తున్నారే తప్ప మిగతా నియోజకవర్గాలకు వాటి అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రాజెక్ట్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి తీరుపై తాము కెసిఆర్ సారథ్యంలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతామని సబితారెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, హరీశ్వర్‌రెడ్డి, మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, పార్టీ ముఖ్య నేతలు క్యామ మల్లేష్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాలమూరు-రంగారెడ్డి జిల్లాల ఎత్తిపోతల ప్రాజెక్ట్‌పై నిర్వహించిన కీలక సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

## కూతురు ప్రేమ వివాహం

### మనస్థాపంతో తల్లి ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

కూతురు ప్రేమ వివాహం చేసుకుందని ఓ తల్లి మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొంపల్లి నాగమణి (42) కూలి పని చేసుకుని జీవనం సాగిస్తుంది. సుమారు మూడు నెలల క్రితం ఈమె కూతురు ప్రేమ వివాహం చేసుకున్నదని తీవ్రమైన మనస్థాపానికి గురైంది. అప్పటినుండి నా బ్రతుకు ఎందుకు, నా కూతురు లేనప్పుడు అని చాలా మనోవేదనకు గురైంది. బుధవారం ఆమె ఇంటి దగ్గర కనిపించకపోవడంతో ఆమె తమ్ముడు రాజు మరికొంత మందితో కలిసి ఫాక్ సాగర్ దగ్గర వెతుకుతుండడంతో ఫాక్ సాగర్ చెరువులో ఆమె మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల అభిప్రాయం ప్రకారం ఆమె కూతురు ప్రేమ వివాహం చేసుకున్నందున మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చునని తెలిపారు. మృతురాలి తమ్ముడు రాజు ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాము.

**అంబేద్కర్‌నగర్ అంగన్‌వాడీ స్థలం ఆక్రమణపై కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని అంబేద్కర్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం స్థలాన్ని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నించిన ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. 2018లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అంబేద్కర్‌నగర్‌లోని 50 చదరపు గజాల ప్రభుత్వ భూమిని అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి కేటాయించారు. అయితే, డి. శమంత చాపల, ఆయన కుమారులు ఈ ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ, అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోర్డులను తొలగించారు. ఈ ఘటనపై ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్ట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఈ. పుష్పావతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సెక్షన్ 329(3), 324(4), 351(2) రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శిశువిహార్ పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**



శిశువిహార్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలతో కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, డిసెంబరు 24,ప్రభాతవార్త:** పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. ఈమేరకు బుధవారం శిశు విహార్ ప్రాంగణంలోనీ బాల సదనంలో రాదే రాధే గ్రూప్ అశ్విని అగర్వాల్, నందకిషోర్ వారి కుటుంబ సభ్యులతో కలసి దుప్పట్లను పిల్లలకు అందచేశారు. అలాగే క్రిస్టమస్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో పిల్లలతో మమేకమై అధికారులతో కలసి కలెక్టర్ కేక్ కట్ చేసి పిల్లలు, సిబ్బందికి క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సేవ గుణం గొప్పదని దుప్పట్లను అందజేసిన వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సమయానికి నాణ్యమైన పౌష్టిక ఆహార పదార్థాలను అందించి, వారి ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం పర్యవేక్షించాలని అలాగే గదులతోపాటు పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. బాల సదనంలో పిల్లల సంఖ్యతో పాటు వారికి అందిస్తున్న పౌష్టిక ఆహారం గురించి, అందుతున్న వైద్య సేవలు తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మోతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి అక్కేశ్వరరావు,బాలసదనం ఇంచార్జ్ సఫీయా ఖనమ్, సింధుర,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చాంద్రాయణగుట్ట ఆలయాలను సందర్శించిన ప్రధాని సతీమణి జశోదబెన్ మోడీ

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** భారత ప్రధాని నరేంద్ర మోది సతీమణి జశోదబెన్ మోది బుధవారం చాంద్రాయణగుట్ట ప్రాంతంలోని పలు దేవాలయాలను సందర్శించారు. ఉదయం శ్రీ దేవి దేవాలయాన్ని, కేశవగిరిపై గల స్వయంభుః శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయాన్ని, శ్వేతగంగను, శ్రీ జగన్నాథస్వామి దేవాలయాలను దర్శించుకున్నారు. ఆయా ఆలయ నిర్వాహకులు, అర్చకులు జెశోదబెన్ మోది, కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమెచే పత్ర్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాల చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. నిర్వాహకులు ఆమెను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెశోదబెన్ మోది సోదరులు అశోక్ జీ, అర్చక స్వాములు పమ్రోద్ కుమార్ కార్వాంకర్, కంజర్ల ప్రతాపాచార్యులు, సంజయ్‌లతోపాటు జ్యోతీధర్ సింగ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



దేవి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోది సతీమణి జశోదబెన్ మోది

## జూబ్లీహిల్స్‌లో అక్రమ నిర్మాణంపై జిహెచ్‌ఎంసికి ఫిర్యాదు



ఫిల్మ్‌నగర్‌లో ఫిర్యాదు చేసిన నిర్మాణం ఇదే

**జూబ్లీహిల్స్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో అక్రమంగా నిర్మిస్తున్న భవనంపై జీహెచ్‌ఎంసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఖైరతాబాద్ జోన్ సర్కిల్-18 పరిధిలోని ఫిల్మ్‌నగర్ రోడ్ నెం.3లో ఉన్న ప్లాట్ నెం. ఎ-13లో సెల్లార్, స్టిల్ట్‌తో పాటు నాలుగు అంతస్తులు, పెంట్‌హౌస్‌పై అంతస్తులతో కూడిన భవనం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మి స్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నిర్మాణం జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో పాటు అవసరమైన సెట్‌బ్యాక్‌లు పాటించకుండా చేపట్టినట్లు పేర్కొన్నారు. దీంతో పరిసర ప్రాంత ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, ముఖ్యంగా భవన నిర్మాణ సామగ్రిని రహదారిపై, నివాసిత ఇళ్ల ప్రవేశ ద్వారాల ముందు పోయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదుదారు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకుని, డెమాలిషన్ స్క్వాడ్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భాగాలను కూల్చివేయాలని జూబ్లీహిల్స్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)కు వినతిపత్రం సమర్పించారు. అక్రమ నిర్మాణానికి సంబంధించిన ఫోటోలను తమ ఫిర్యాదుతోపాటు అందరికి జత చేశారు. కాగా అక్రమ నిర్మాణంపై దృష్టి పెడుతామని అధికారులు హామినిచ్చారు.

## పౌరాణిక నాటకాలు తెలుగు జాతి కళా సంపదలు



రంగస్థల నటీనటులు సురభి ప్రియాంకను, ఎం. అర్జున రావును, ఎస్.గురునాథా చారిని, గాయకుడు సుదర్శన్ ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 24,ప్రభాతవార్త :** పౌరాణిక పద్య నాటకాలు తెలుగుజాతి కళాసంపదలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ సౌజన్యంతో గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికలో ఆరాధన సంస్థ 17వ పద్య నాటకోత్సవాలు నిర్వాహక సంస్థ అధినేత లోకం కృష్ణయ్య ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో సాహితీ వేత్తలు బైస దేవదాసు, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరు వెంకటదాసు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, కళా రాధకులు నరేందర్ గౌడ్, ఎన్. రామారావు, గాయకుడు టీ.వీ.రావు వీరంతా తెలుగు పౌరాణిక పద్య నాటకాల విశిష్ట గురించి మాట్లాడారు. ఆరాధన సంస్థ వ్యవస్థాపకుడు లోకం కృష్ణ య్య సభలో నివేదిక చదివారు. జీవీఆర్. ఆరాధన ప్రధానకార్యదర్శి వి.వి.రాఘవరెడ్డి తదితరులు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగస్థల నటీనటులు సురభి ప్రియాంకను, ఎం. అర్జున రావును, ఎస్.గురునాథా చారిని, గాయకుడు సుదర్శన్ ను సభలో పాల్గొన్న అతిథులు ఘనంగా సత్కరించారు. సభకు ముందు బాల నాగమ్మ పద్య నాటకాన్ని నటినటు లు జనరంజకంగా ప్రదర్శించారు.

## తుదిదశకు జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణ పనులు



పనులను పరిశీలిస్తున్న బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, జి హెచ్ ఎం సి అధికారులు

**చిక్కడపల్లి డిసెంబర్ 24 (ప్రభాతవార్త ) :** గాంధీనగర్ డివిజన్ జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. బుధవారం స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ సూచనల మేరకు పనులను బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ పరిశీలించారు. జి హెచ్ ఎం సి ద్వారా రూ: 26 లక్షల నిధుల మంజూరు తో చేపట్టిన పనులు పూర్తై త్వరలో ప్రజల అందుబాటులోకి రానున్న తరుణంలో స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ సూచనల మేరకు జి హెచ్ ఎం సి అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్,కాంట్రాక్టర్ తో కలసి వినయ్ కుమార్ గారు పనులను పర్యవేక్షించారు.కార్యక్రమంలో జవహర్ నగర్ వ్యాయామశాల, ఆటస్థలం మరియు కళ్యాణ మంటపం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు నెర్మెట్ట మల్లేష్, జి. మహేందర్, బిజెపి నేతలు ఆనంద్ రావు, సాయి కుమార్,జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


## 4న ఎగ్జామ్‌థాన్ పేరిట 5కె రన్



కర్ర ప్రతాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డా.ప్రవీణ్‌రావు

**సైఫాబాద్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** పరీక్షల సమయంలో విద్యార్థుల్లో పెరుగుతున్న వత్తిడీని తగ్గించడానికి ఎగ్జామ్‌థాన్ పేరిట జనవరి 4వ తేదీన 5కె రన్ నిర్వహిస్తున్నామని కావేరి యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ డా.ప్రవీణ్‌రావు తెలిపారు. ఈ రన్‌కు సంబంధించిన లోగో, టీ-షర్టులను, మెడల్స్‌ను బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల భయం వల్ల విద్యార్థుల్లో మానసిక వత్తిడీ పెరుగుతున్నదని, దీనిపైన సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జనవరి 4వ తేదీన గచ్చిభౌలిలోని టీ హబ్ వద్ద 5కె రన్ నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షలను భయంతో కాకుండా ధైర్యంగా, ఆత్మ విశ్వాసంతో ఎదుర్కొనేలా విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ ఎగ్జామ్‌థాన్ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

### నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీగణేష్



**కంటోన్మెంట్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** మోండా డివిజన్ కుమ్మరిగూడలోని శ్రీ రాజ రాజరాజేశ్వరి దేవాలయం సత్సంగ్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రవికాంత్, సీనియర్ కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, సత్సంగ్ కమిటీ ప్రతినిధులు విజయ లక్ష్మి, రుక్మిణి, అరుణ,ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు వీర లక్ష్మి, కుమారి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.





ఎస్ఎంపి పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటున్న విద్యార్థులు,ఉపాధ్యాయుల దృశ్యం





జేహెచ్‌పీఎస్‌లో కేక్ బేకింగ్ తయారీలో చిన్నారులు.



క్రిస్మస్ వేడుకల్లో భవన్స్ ఆత్మకూరి రామారావు పాఠశాల విద్యార్థులు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**హైదర్షాకోట్ గ్రామంలో**

**నార్సింగి, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ సర్కిల్ హైదర్షాకోట్ గ్రామంలో ఉన్న ఎస్ఎంపి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. పాఠశాల ఆవరణ అంతా అందమైన క్రిస్మస్ చెట్లు, అలంకరణతో అందంగా ముస్తాబు చేవారు. విద్యార్థులు ఏసుక్రీస్తు జీవిత చరిత్రను తెలిపే నాటికలను ప్రదర్శించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. విద్యార్థులు శాంతాక్లాజ్ వేశధారణలో వచ్చి చాక్లెట్లు పంచారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వేడుకలు జరుపుకోవడమే కాకుండా ఏసుక్రీస్తు సూచించిన బోధనలు ప్రేమ, కరుణ, క్షమ, సేవ భావాలను అలవాటు చేసుకోవాలన్నారు. ఏసు బోధనలు మానవత్వంను పెంచుతాయని తెలిపారు. సాటి వారికి సహాయం చేయడం, అన్ని ప్రాణుల పట్ల ప్రేమను కలిగి ఉండడం ప్రతీ ఒక్కరూ పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చంద్రకళ, ప్రిన్సిపాల్ జేసుదాసు, డైరెక్టర్ శ్వేతారెడ్డి, ఎండి భవ్యారెడ్డి, సిఇఓ దివ్యారెడ్డి, హెడ్‌ఆఫ్ స్కూల్ ఆపరేషన్స్ వంశీప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జేహెచ్‌పీఎస్‌లో**

**జూబ్లీహిల్స్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్)లో బుధవారం ఆర్గానిక్ కేక్ బేకింగ్‌పై చిన్నారులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ప్రత్యేకంగా తీసుకొచ్చిన చెఫ్ ఈ ఆర్గానిక్ కేక్ విధానాన్ని చిన్నారులకు వివరించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొని కేక్ తయారీ గురించి ఆసక్తి చూపారు.

**భవన్స్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో**

జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్స్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో క్రిస్మస్ పండుగ ప్రాశస్త్యాన్ని తెలలియజేస్తూ ఏర్పాట్లు చేశారు. క్రీస్తు జననం గురించి చిన్నారులు వేసిన రూపకల్పన అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చిన్నారులు క్రిస్మస్ పండుగ వేషధారణాలతో, శాంటాక్లాజ్‌ల తీరుతో తయారై వచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలతానాయర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రొటెస్టంట్ క్రిస్టియన్‌లకు అధిక ప్రాధాన్యత ఇస్తాం

**...ప్రభుత్వ పూర్వ సలహాదారు వెం నరేందర్ రెడ్డి**



ప్రభుత్వ సలహాదారు వెం నరేందర్ రెడ్డిని కలిసిన క్రిస్టియన్ సంస్థల ప్రతినిధులు గొనె సల్మాన్ రాజ్ తదితరులు

**చిక్కడపల్లి డిసెంబర్ 24 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రొటెస్టంట్ క్రిస్టియన్ లకు సంబందించిన సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి తో ప్రస్తావించి వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వెం నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రొటెస్టెంట్ చర్చి సీనియర్ పాస్టర్ ల బృందం సభ్యులు వెం నరేందర్ రెడ్డి ని కలిశారు. ప్రొటెస్టెంట్ క్రిస్టియన్ లు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటూ వస్తున్నారని, వారిని అన్ని విధాలుగా అండగా ఉంటామని, ముఖ్యంగా నామినేటెడ్ పదవుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా క్రిస్టియన్ వర్గానికి చెందిన గొనె సల్మాన్ రాజ్ కు ప్రభుత్వ నామినేటెడ్ చైర్మన్ పోస్ట్, అదే విధంగా వైస్ చైర్మన్, డైరెక్టర్లు, ఇతర పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గొనె సల్మాన్ రాజ్ 1983 నుండి కాంగ్రెస్ పార్టీ లో ఉంటూ నేడు వివిధ హోదాలలో పనిచేశారని కోరారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పాస్టర్ల ఫెలోషిప్, క్రిస్టియన్ సంస్థలు గొనె సల్మాన్ రాజ్ కు చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. వెం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రొటెస్టెంట్ క్రిస్టియన్ నాయకత్వాన్ని రాష్ట్రము కోరుకుంటుందని, త్వరలో లక్ష మంది క్రిస్తవులతో సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ ఎం.పురుషోత్తం, బి. విన్సన్ , కే. డేనియల్, పి. జయప్రకాశ్ , బేనోని రిచర్డ్ , బి.ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు

## సందేశాత్మకంగా రక్తసంబంధ అనుబంధాల 'తరమెల్లిపోతుందో' నాటక ప్రదర్శన



తరమెల్లిపోతుందో సాంఘిక నాటకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, డిసెంబరు 24 ప్రభాతవార్త :** నేటి ఆధునిక సాంకేతికయుగంలో మానవ రక్తసంబంధ అనుబంధాల తరం మారిపోతోందని ఆవేదన వ్యక్తపరుస్తూ తండ్రి సంపాదించిన ఆస్తులు, అంతస్థులు పంచుకునే విషయంలో కొంతమంది అన్నదమ్ములు, కుటుంబీకులు జీవితాంతం ఒకరినొకరు పలకరించుకోని దుస్థితి, ఇళ్లల్లో వేడుకలకు తోడబుట్టినోళ్లని పిలవరని... ఇదేనా ఒక గర్భాన పుట్టినవారి బంధం, రక్తసంబంధం?. అలనాటి నుండి వస్తున్న ఆ తరమెల్లిపోతుందో అని చెప్పినా వినని సమాజానికి రానున్న తరాల సంగతేంటని హెచ్చరిస్తూ కుటుంబ వ్యవస్థకు అద్దంపడుతుంది తరమెల్లిపోతున్నదో నాటకం. మరణం వరకు అందరూ బ్రతుకుతారు కానీ మరణం తర్వాత కూడా బ్రతికేవాడే నిజమైన మనిషి... తోడునీడగా ఉంటేనే బలం తోబుట్టువు పుట్టుక. ఇది తెలియనివాడికి ఆస్తులు, అంతస్తులు ఎన్నివున్నా జీవి తాంతం ఒంటరినేనని నొక్కివక్కాణిస్తుంది ఈ నాటకం. రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బుధవారం రాత్రి శ్రీకరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్, గుంటూరు వారి సమర్పణలో రామకృష్ణ బొమ్మిడి రచన, దర్శకత్వంలో బి.రామకృష్ణ, డా. శ్రీజ, నాగరాణి, జనార్ధనవర్మ, పి.నాగేశ్వరరావు వారివారి పాత్రల్లో జీవించగా వెంకటరమణ సంగీతంలో రూపొందిన ఈ తరమెల్లిపోతున్నదో సాంఘిక నాటక ప్రదర్శన విచ్చేసిన నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి సందేశాన్ని అందించింది.

## వస్తువులు కొనేటప్పుడు అప్రమత్తతతో ఉండాలి : రామానుజస్వామి



జ్యోతిప్రకాసనచేసి సదస్సు ను ప్రారంభిస్తున్న రామానుజస్వామి, శ్రీనివాసులు, చంద్రకుమార్, శ్రీవల్లి, దైవనిధి తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 24 ప్రభాతవార్త :** వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తగుజాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని ప్రపంచవ్యాప్త వినియోగదారుల హక్కులు మరియు పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ఎస్.రామానుజస్వామి సూచించారు. కొంటున్న వస్తువులపై బిల్లుతోపాటు గడువు తేదీని సరిచూసుకోవాలన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ దేవా సాంబమూర్తి సభాధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సును ముఖ్యఅతిథులు రామానుజస్వామి, జస్టిస్ బి.చంద్రకుమార్, ముఖ్యమంత్రి ఓఎస్‌డి వేముల శ్రీనివాస్, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి శ్రీనివాస్, తూనికలు కొలతల అధికారిణి శ్రీవల్లి, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ దైవనిధి తదితరులు పాల్గొని జ్యోతిప్రకాసనం చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. దుకాణదారుడు వినియోగదారుల ఉత్పత్తులపై ముద్రించిన గరిష్ట చిల్లర ధర(ఎమ్మార్పీ)పై స్టిక్కర్లను అతికించడం చట్టవిరుద్ధమన్నారు. ప్రజల్లో చైతన్యం తేవడానికి అవగాహన సదస్సులు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి ఓఎస్‌డి వి.శ్రీనివాసులు మాట్లాడుతూ దుకాణదారుడు ఏదైనా వస్తువులు అమ్మేటప్పుడు ధర్మాన్ని పాటిస్తే ఎలాంటి చట్టాలు అవసరం లేదన్నారు. కొంతమంది లాభాపేక్షతో అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ధర్మాన్ని విడనాడితే ఎన్నిచట్టాలొచ్చినా ఫలితం శూన్యమన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ వినియోగదారుల భారతీయ రక్షణ హక్కు చట్టంలో ప్రాణానికి, ఆస్తికి హాని కలిగించే వస్తువుల సేవల నుండి రక్షణపొందే హక్కుందన్నారు. చట్టంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సంస్థ చైర్మన్ రామానుజస్వామి వినియోగదారుల రక్షణ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని కోరారు. భారత రాష్ట్రపతి వినియోగదారుల రక్షణ చట్టాన్ని 1986 డిసెంబరు 24న ఆమోదించడంతో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు నాగరాజు, వీరభద్రరావు, కె.కె.రాజు, వెంకటేష్, సాయికుమార్, డా. రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ద్వారదర్శనానికి ముస్తాబవుతున్న శ్రీవారి ఆలయం

### 30న వైకుంఠ ద్వారదర్శనం.. లక్ష మంది వచ్చే అవకాశం

**చిక్కడపల్లి డిసెంబర్ 24 (ప్రభాతవార్త ) :** హిందువుల ముఖ్యమైన పండుగలలో వైకుంఠ ఏకాదశి(ముక్కోటి ఏకాదశి) ముఖ్యమైన పండుగ. ఈ పర్వదినోత్సవాన్ని ఎంతో పవిత్రమైన దినంగా భావిస్తారు. కాలపరిగణంలో తెలుగువారిది చాంద్రమానం. వైకుంఠ సౌరమాన ప్రకారం జరిపే పండుగ. కర్కాటక సంక్రమణం(దక్షిణాయణ) మకర సంక్రమణం(ఉత్తరాయణం) తదితర పర్వదినాలవలె ఇది కూడా సౌరమానాన్ని అనుసరించి జరిపే పండుగలలో ఒకటి. ధనురాశిలోకి రవి ప్రవేశించిన తర్వాత వచ్చే శుద్ధ ఏకాదశి వైకుంఠ ఏకాదశి. ఇది మార్గశిర మాసంలో కాని పుష్యమాసంలో కాని వస్తుంది. వైకుంఠ ఏకాదశి రోజున శ్రీమన్నారాయణుని ఉత్తర ద్వారం నుంచి కూడా సేవించుకుంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమైన ఫలితం ఇస్తుందని పెద్దల వచనము. ఈ రోజు శ్రీమన్నారాయణుని దర్శించిన వారికి పునర్జన్మలేదని శాస్త్ర ప్రమాణము. వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు శ్రీవారి ఆలయంల అన్ని ఏర్పాట్లు చేసినట్లు చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ అన్నపూర్ణ వివరించారు. కాగా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా జరిగే ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 4 గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వారదర్శనం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. వైకుంఠ ద్వారదర్శనం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయం అధికారులు వెల్లడించారు. క్యూలైన్‌లలో పెద్ద సంఖ్యలో వాలంటీర్లు ప్రత్యేక దుస్తుల్లో ఉంటారని, అదనపు సిబ్బంది, వివిధ శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పెద్దసంఖ్యలో సీసీటీవీ కెమెరాలను అమర్చడం జరుగుతుందని, భక్తుల సౌకర్యార్థం శీఘ్రదర్శనం, దర్మదర్శనం, క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరిగిందని, మొబైల్ మరుగుదొడ్ల ఏర్పాటు, మంచినీటి వసతి ఏర్పాటు, ఆలయాన్ని విద్యుత్‌దీపాలను అలంకరణలు చేయడం జరిగిందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని దర్శించుకుని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

## నూతన సిఐ,ఎస్ఐలకు సన్మానం



**అత్తాపూర్ డిసెంబర్ 24,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా సిఐగా బాధ్యతలు చేపట్టిన ముత్తు యాదవ్ ,ఎస్ఐ ప్రశాంత్ రెడ్డిలను జై భీమ్ జై రామ్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో కలిసి ఘనంగా సన్మానించారు.అనంతరం ప్రేమావతి పేట్ గ్రామంలో గల బేతేస్తా ప్రార్ధన మందిరానికి క్రిస్మస్ వేడుకల సందర్భంగా రావాలని చర్చి పెద్దలు ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ శంకరయ్య,తంగడిపల్లి భాస్కర్,సునిగంటి యాదయ్య,కవ్వగూడెం హరినాథ్,గోల్కొండ లేవిరాజ్, గోల్కొండ ఉపేందర్,ఎడ్లకాడి చంద్ర శేకర్,బర్ల సుమన్, కవ్వగూడెం గౌతమ్,ఎడ్లకాడి అనిల్ కుమార్,రాకేష్, ఎరుకలి పవన్,ఉన్నారు.

## వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన అవసరం -ఉప్పల శ్రీనివాస్ గుప్త



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

**చిక్కడపల్లి డిసెంబర్ 24 ( ప్రభాతవార్త ) :** వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిధిగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై ప్రసంగించారు. వినియోగదారుల సంక్షేమం కోసం జరుగుతున్న ఉద్యమానికి ఈ కార్యక్రమం మరింత బలాన్ని చేకూరుస్తుందని, ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఏసీపీ కె.ఎం. కిరణ్ కుమార్, జైపాల్ రెడ్డి, సీతాఫల్మండి కార్పొరేటర్ డా. శ్యామల హేమ ,నేషనల్ కన్స్యూమర్ రైట్స్ చైర్మన్ డా. ఆర్. సాయి రమేష్ గౌడ్ , తెలంగాణ రాష్ట్ర కన్స్యూమర్ రైట్స్ చైర్మన్ సోమ రామ్ మోహన్ , భార్గవి, గాయత్రి సింగ్, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## చేనేతలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2000 కోట్లు కేటాయించాలి

**చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు**

**చిక్కడపల్లి డిసెంబర్ 24 ( ప్రభాతవార్త ) :** చేనేత కార్మికుల ఉపాధి సంక్షేమం కోసం ఈ నెల 29 న జరిగే శీతాకాల అసెంబ్లీ సమావేశంలో చేనేతల కు చేనేత ప్రత్యేక పాలసీ ఏర్పాటుచేసి చేనేత లకు రెండువేల కోట్లు బడ్జెట్లో నిధులను తక్షణమే కేటాయించి అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చేనేతల కు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి కష్టానికి తగిన ఆదాయం లభించక అనేక ఇబ్బందులు పడుతూ వలసలు పోతూన్నరని ఆర్థిక ఇబ్బందులతో ఆకలి చావులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనే 37 మంది చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని చిక్కా దేవదాసు ఆవేదన వ్యక్తం చేశారు. హ్యాండ్లూమ్ కార్పొరేషన్, టెక్స్టైల్ కార్పొరేషన్, పద్మశాలి కార్పొరేషన్, పవర్లూ మ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఎందుకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం లేదని, 12 సంవత్సరాలు గడుస్తున్నా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు ఎందుకు నిర్వహించడందని తక్షణమే నిర్వహించి టెస్కో కు పాలక వర్గాన్ని ఏర్పాటు చేసి సంఘాలను బలోపేతం చేయాలని చిక్కా దేవదాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి






సిపిఐ భారీ కటౌట్‌ను ఆవిష్కరిస్తున్న ఇ.టి.నర్సింహ్మా

**సైఫాబాద్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న జరిగే సిపిఐ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం హిమాయత్‌నగర్‌లో హైదరాబాద్ జిల్లా సమితి కార్యాలయం ఎదుట సిపిఐ భారీ కటౌట్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో సిపిఐ పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అయ్యిందని, ఆనేక నిర్భంధాలు ఎదుర్కొని ప్రజల కోసం పనిచేస్తున్న క్రమంలో నిషేదానికి కూడా గురైందన్నారు. నాయకులపై అక్రమ కేసులు నమోదు అయ్యాయని, కుట్ర కేసులను చేధిస్తూ జైలు జీవితాన్ని అనుభవిస్తూ నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన పార్టీ సిపిఐని వేలాది గ్రామాల్లో నిర్మాణం చేయడం జరిగిందన్నారు. 26వ తేదీన అన్ని చోట్ల పార్టీ జెండాలను ఎగరవేసి శతాబ్ధి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 27న అక్రెడిటేషన్ కార్డులపై రౌండ్ టేబుల్ సమావేశం

**సైఫాబాద్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మీడియా అక్రెడిటేషన్ రూల్స్ ఖరారు చేస్తూ జాచీ చేసిన జివొ 252పై పలు జర్నలిస్టు సంఘాలు బుధవారం నాడిక్కడ అత్యవసరంగా సమావేశమైనాయి. అటు జర్నలిస్టులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరించి, తప్పులు తడకగా ఉన్న జివొ నెంబర 252 సవరణకు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని ఆ సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు బుధవారం నాడిక్కడ ఈ సమావేశంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్), అఖిల భారత జర్నలిస్టుల సంఘం (ఎడబ్ల్యూజెఎ), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐఎఫ్‌డబ్ల్యూజేఎఫ్), తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టిజెఎస్ఎస్) ప్రతినిధులు మామిడి సోమయ్య, కె.కోటేశ్వర్‌రావు, పులిపలుపుల ఆనందం, అనంచిని వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు వెంకటరత్నం ఈ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల ను వారు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని, ఇందులో అన్ని జర్నలి స్టు సంఘాలను కలుపుకుని ముందుకుపోవాలని నిర్ణయించినట్లు తెలి పారు. ఈ సమావేశంలో జివొ నెంబరు 252పై చర్చించి కార్యాచరణను రూపొందిస్తామని, అవసరమైతే జెఎసిని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## భీమా కోరేగావ్ మహర్ రెజిమెంట్ విజయ్ దివస్ జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణస్వరూప్, సుబ్బారావు, నర్సింహాచారి, ప్రవీణ్‌కుమార్ తదితర నాయకులు

**నాంపల్లి, డిసెంబరు 24 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా జరిగే భీమా కోరేగావ్ మహర్ రెజిమెంట్ విజయ్ దివస్ 207వ మహోత్సవాలను జయప్రదం చేయండని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. ఈమేరకు జనవరి 1న జరిగే మహోత్సవాల పోస్టర్‌ను పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కృష్ణస్వరూప్ పార్టీ నాయకులు చొప్పరి సుబ్బారావు కె.నర్సింహాచారి, మద్దెల ప్రవీణ్‌కుమార్, ఐహెచ్‌ఆర్‌సి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ బాలాజీ పవార్, నక్కా దేవేందర్ తదితరులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అంటరానితనం, కుల వర్ణ వివక్షకు మూలమైన పిఐఎస్‌డబ్ల్యుఏ బ్రాహ్మణ అరాచకం 25వేలమంది సాయుధ సైనికరాజ్యాన్ని మహర్ సైనికుల విజయం సాధించిన రోజు సందర్భంగా అణగారిని సమాజమంతా ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలని వడ్లమూరి పిలుపునిచ్చారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**జీడిమెట్ల, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు అలాగే కిసాన్ దివాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యవాణి విద్యానికేతన్ హై స్కూల్ ఎస్.ఆర్. నాయక్ నగర్ నందు ముఖ్యఅతిథిగా రేవ్. ఢీకన్ మనోజ్, టివిఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ నందు ముఖ్యఅతిథిగా జీవన్ ప్రకాష్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీసస్ జన్మ రహస్యం జీసస్ దేవుడిగా ప్రజా శ్రేయస్సు ప్రజాకాంక్ష ప్రేమ అభిమానాలు బైబిల్ లోని వీటన్నింటిని గురించి తెలియజేశారు. శాంటా క్లాస్ వేషధారణతో చిన్నారులకు చాక్లెట్లు ఇస్తూ ఆకట్టుకున్నారు. అనంతరం చౌదరి చరణ్ సింగ్ జన్మదిన సందర్భంగా 2001 నుండి జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ప్రస్తుతం వ్యవసాయం పూర్తిగా తగ్గిపోయి కల్తీ పాలు, కల్తీ బియ్యం, కల్తీ కూరగాయలు మార్కెట్లోకి వచ్చి అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఆనాటి రైతు కష్టాన్ని కళ్లకు కట్టినట్లుగా చిన్నారులు నృత్య నాటిక ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కొరస్పాండెంట్ అరుణ కుమారి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి,డైరెక్టర్ లక్ష్మి పూర్ణిమ,విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హిందువులపై దాడులను ఖండిస్తూ నిరసన



**అత్తాపూర్ డిసెంబర్ 24,ప్రభాతవార్త :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ డివిజన్ బిజెపి అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో బాంగ్లాదేశ్ పీఎం మొహమ్మద్ హుస్సేన్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. హిందువులపై జరుగుతున్న హింసకాండను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కొమురయ్య ,రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ కాడం సుధాకర్ ,అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ,అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ విజయకుమార్ ,సత్యనారాయణ ముదిరాజ్ ,కిరణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రావుల జగన్ ,వెంకట్ రెడ్డి, రాజు, పైల్వన్ శశికాంత్ శర్మ ,ఎస్ బి హరినాథ్ ,ముకేష్ ,జయనంద్ రెడ్డి ,సిదేశ్వర్ ,అనురాధ ,ఉమ సరిత ,విజయ రెడ్డి ,గాయత్రి, కృష్ణ వేణీ, శేఖర్ శెట్టి ,బాలకృష్ణ ,సతీష్ ,లకన్ శివ ,రాము, పాల్గొన్నారు.

### బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అపాలి

**ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసిన అంతర్జాతీయ న్యాయవాది**

**సైఫాబాద్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింస, దాడులను తక్షణమే ఖండించాలని అంతర్జాతీయ న్యాయవాది డా.కరణం రాజేష్‌కుమార్ ఐక్యరాజ్య సమితి, మానవ హక్కుల మండలిలో ఫిర్యాదు చేశారు. బంగ్లాదేశ్, భారతదేశ ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలని, ఇందుకోసం ప్రపంచదేశాల తోడ్పాటు ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల నాయకులు వెంటనే స్పందించి బంగ్లాదేశ్‌లో శాంతిని ఏర్పరిచేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఆఫ్రికా దేశంలో భారతదేశానికి చెందిన ప్రజలు కొట్టుకుంటుంటే స్పందించిన ప్రముఖ క్రైస్తవ మతబోధకులు కె.ఎ.పాల్ ప్రస్తుతం ఎక్కడున్నారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్‌లోని దాడులపై ఐక్యరాజ్య సమితితోపాటు మానవ హక్కుల మండలి, హ్యూమన్ రైట్స్ వాచ్, మైనార్టి రైట్స్ గ్రూప్ ఇంటర్‌నేషనల్ సంస్థలో కూడా తాను ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు.

